A1TV NEWS

నేటి ఆంధ్రప్రగతి

APTEL 2023/16425

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 197 శనివారం మార్చి 02- 2024 పేజీలు 4. వెల :4 /

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

# టిడిపికి షాక్..

## -వైసీపీలోకి సతీష్ రెడ్డి.!


ఆంధ్ర ప్రగతి అమరావతి మార్చి01: తెలుగు దేశం పార్టీకి షాక్ తగిలింది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. పార్టీ కండువాతో సతీష్ రెడ్డిని సీఎం జగన్ స్వాగతించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, పలువురు స్థానిక నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేశ్‌పై విమర్శలు గుప్పించారు.

2



# ఈనెల 5న బిజెపిలో చేరనున్న టిడిపి..?

ఆంధ్ర ప్రగతి అమరావతి మార్చి01: తెలుగుదేశం పార్టీతో కలిసేందుకు బిజెపి ఒప్పుకుందా? టిడిపి ఎన్డీఏలోకి ఎంట్రీ ఇవ్వనుందా? చంద్రబాబు ఈనెల 4న ఢిల్లీ వెళ్ళనున్నారా? 5న పొత్తుపై స్పష్టమైన ప్రకటన రానుందా?ఏపీ పొలిటికల్ సర్కిల్లో బలమైన చర్చ నడుస్తోంది. టిడిపితో బీజేపీ సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది కొలిక్కి రావడంతో చంద్రబాబును బిజెపి పెద్దలు ఆహ్వానించినట్లు సమాచారం. అయితే గతంలో ఇదే తరహా ప్రచారం జరిగింది. కానీ ఎటువంటి ప్రకటన రాలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే వైసిపి అనుకూల మీడియాలో సైతం ఇటువంటి వార్తలు వస్తుండటంతో.. వాస్తవం ఉంటుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.అయితే బిజెపికి దాదాపు సీట్లను చంద్రబాబు సర్దుబాటు చేశారని.. బిజెపి అగ్ర నేతలు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.



అయితే సీట్ల సర్దుబాటుపై రకరకాల ప్రచారం నడుస్తోంది. ఐదు అసెంబ్లీ, మూడు పార్లమెంట్ స్థానాలని.. కాదు కాదు 12 అసెంబ్లీ, ఏడు లోక్సభ స్థానాలని.. ఇలా సోషల్ మీడియాలో లేనిపోని ప్రచారం జరుగుతోంది. దీంతో తెలుగుదేశం పార్టీ ఆశావహుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. పొత్తుల్లో భాగంగా జనసేనకు కీలక స్థానాలు కేటాయించడంతో.. చాలామంది నాయకులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పార్లమెంట్ స్థానాలకు సంబంధించి విశాఖపట్నం, రాజమండ్రి, నరసాపురం, ఏలూరు, తిరుపతి, రాజంపేట, హిందూపురం నియోజకవర్గాలను బిజెపి అడుగుతోందని ప్రచారం జరుగుతోంది. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖ ఉత్తరం, తాడేపల్లిగూడెం, కైకలూరు, గుంటూరు పశ్చిమ, జమ్మలమడుగు, ధర్మవరం,రాజమండ్రి సిటీ స్థానాలను బిజెపికి కేటాయించినట్లు టాక్ నడుస్తోంది. అయితే ఎల్లో మీడియాలో ఒక తరహా ప్రచారం జరుగుతుండగా.. నీలి మీడియాలో మరో తరహా ప్రచారం జరుగుతుండడం విశేషం. టిడిపి అనుకూల మీడియాలో తక్కువ స్థానాలను బిజెపికి ఇస్తున్నట్లు చెబుతుండగా.. వైసిపి అనుకూల మీడియాలో మాత్రం బిజెపి భారీగా సీట్లు డిమాండ్ చేస్తున్నట్లు చూపిస్తుండటం గమనార్హం. మరోవైపు ఇప్పటికే టిడిపి ప్రకటించిన సీట్లను సైతం బిజెపి ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అటు బిజెపి పవర్ షేరింగ్ను సైతం అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా ప్రచారంతో టీడీపీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది.

# జగన్‌ను వదిలేసిన బిజెపి.. అసలు కారణం ఇదే.!

ఆంధ్ర ప్రగతి అమరావతి మార్చి 10: పదేళ్లుగా కేంద్రంలో బిజెపి అధికారంలో ఉంది. 2014లో ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. 2019లో సైతం మరోసారి విజయం సాధించింది. 2014 కంటే 2019లో ఫలితాలను మెరుగుపరుచుకుంది.అయితే వరుసగా రెండుసార్లు విజయం సాధించినా.. రాజ్యసభలో మాత్రం మెజారిటీ సాధించలేకపోయింది. దీంతో మిగతా రాజకీయ పక్షాలపై ఆధారపడక తప్పలేదు. ఈ క్రమంలోనే ఏపీ రాజకీయాలను తనను అనుకూలంగా మలుచుకుంది. గత ఎన్నికలకు ముందు ఎన్ డి ఏ ను విభేదించి చంద్రబాబు బయటకు వెళ్లారు. ఎన్నికల్లో దారుణంగా దెబ్బతిన్నారు. దీంతో కేంద్రం నుంచి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని.. తన వద్ద ఉన్న నలుగురు రాజ్యసభ సభ్యులను బిజెపిలోకి పంపించారని ప్రచారం నడిచింది. మరోవైపు వైసీపీకి సైతం ఉన్న రాజ్యసభ సభ్యుల సహకారం తీసుకున్న సందర్భాలు చాలా ఎక్కువ. అందుకే వైసిపి విషయంలో బిజెపి సానుకూలంగా ఉండడానికి ఇదే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

అయితే పదేళ్ల తర్వాత బిజెపికి రాజ్యసభలో మెజారిటీ లభించింది. ఇకనుంచి ఆ పార్టీ ఇతరులపై ఆధార పడాల్సిన పనిలేదు. ఇప్పుడు వైసీపీలో భయానికి కూడా ఇదే కారణం. ఇప్పటికే చంద్రబాబు ఎన్డీఏలోకి ఎంట్రీ ఇస్తారని తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి కడతాయి. కేంద్ర ప్రభుత్వపరంగా ఆ కూటమికి బిజెపి ఎనలేని సహాయ సహకారాలు అందిస్తుంది. అవి ఎన్నికల్లో ఎలా ఉంటాయో జగన్ కు తెలియనివి కావు. అందుకే ఆయనలో ఒక రకమైన భయం కనిపిస్తోంది.అయినా సరే జగన్ బిజెపిని విడిచి పెట్టే ఛాన్స్ లేదు. దానికి తన పై ఉన్న కేసులే కారణం.

ప్రస్తుతం రాజ్యసభలో వైసీపీకి 11 మంది సభ్యులు ఉన్నారు. టిడిపికి కనీస ప్రాతినిధ్యం లేదు. ఈ ఎన్నికల్లో గెలుపొందితే టిడిపికి ప్రాతినిధ్యం దక్కే అవకాశం ఉంది. ఒకవేళ వైసీపీ అధికారానికి దూరమైతే మాత్రం.. ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు ఎంతవరకు ఆ పార్టీలో కొనసాగుతారు అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఇది అప్రస్తుతం అయినా.. వైసీపీ రాజకీయ అవసరాలు బిజెపికి తీరిపోయాయి. ఏపీలో బలపడాలన్న ఆకాంక్షతో బిజెపి అగ్ర నాయకత్వం ఉంది. ఈ తరుణంలో పొత్తుల ద్వారా లభించే సీట్లలో గెలుపొందడం, బలమైన సంస్థాగత నిర్మాణం చేపట్టడం వంటి వాటిపై దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి. సహజంగా ఇవి జగన్ కు కలవరపెట్టే అంశాలే .

గత ఐదు సంవత్సరాలుగా జగన్ ఎటువంటి నిర్ణయాలు తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పరంగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. బిజెపి పరంగా అమరావతి రాజధానికి మద్దతు తెలిపినా.. కేంద్ర ప్రభుత్వ పరంగా జగన్ తీసుకున్న నిర్ణయాలపై ఏనాడూ మోకాలు అడ్డలేదు. అయితే రాజ్యసభలో వైసిపి అవసరాలు మేరకు.. కేంద్రం ఇతోధికంగా జగన్ కు మద్దతు తెలుపుతూ వచ్చింది. కీలక బిల్లులు పాస్ కావడానికి వైసిపి సహకారం అందించింది. కాంగ్రెస్ తో పాటు విపక్షాలు రాజ్యసభలో బలంగా ఉండేవి. వాటిని ఎదుర్కోవడానికి వైసిపి సహకారం అనివార్యంగా మారింది. ఇప్పుడు బిజెపికి సొంత బలం రావడం, రాజ్యసభలో మెజారిటీ మార్కు దాటడంతో వైసిపి అవసరం లేకుండా పోయింది. అయితే ఇది జగన్ కు వ్యక్తిగతంగా లోటే. చంద్రబాబు ఎన్డీఏ లో చేరడంతో పాటు మూడోసారి.. బిజెపి కేంద్రంలో అధికారంలోకి రానుండడంతో ముమ్మందు జగన్ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొనక తప్పదని కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.





# జగన్ ను ఓడిస్తేనే నా తండ్రి హత్య కేసులో న్యాయం జరుగుతుంది..!!

## - వైయస్ సునీత రెడ్డి సంచలన వ్యాఖ్యలు.

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ మార్చి 01: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తన తండ్రి మృతిపై కీలక వ్యాఖ్యలు చేశారు.మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు ముందుకు సాగడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం తాను ఐదేళ్లుగా పోరాడుతున్న పట్టించుకోవడంలేదని, తనకు ప్రజా కోర్టులోనే తీర్పు కావాలని ఆమె కోరారు. నా తండ్రికి న్యాయం జరిగే ప్రజా తీర్పు కావాలని కోరుకుంటున్నాను అని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో హత్య రాజకీయాలు ఎక్కువని, మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే తన తండ్రి హత్య కేసుకు న్యాయం జరగదని ఈ సందర్భంగా ఆమె వాపోయారు.

వివేక హత్య కేసులో అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారని వాళ్లను రక్షించే పనిలో జగన్ ఉన్నారని ఆరోపించారు. జగన్ పై ఉన్న 11 కేసులు మాదిరిగా వివేక హత్య కేసు కాకూడదని ఆమె పేర్కొన్నారు. తన అన్న సీఎం జగన్ పాత్ర పైన విచారణ జరగాలని, నిర్దోషి అయితే వదిలేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే ప్రభుత్వం మళ్లీ వస్తే ఇంకా కష్టాలేనని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. సాధారణంగా హత్య కేసుల్లో నాలుగైదు రోజుల్లోనే నిందితులు ఎవరన్నది తేలిపోతుందని, వివేకానంద రెడ్డి హత్య కేసులో ఐదేళ్లయిన ఇంకా ఎందుకు తేలడం లేదంటూ ఆమె ప్రశ్నించారు.

2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి పోటీ చేశారని, ఆయన ఓడించాలని కొందరు ప్రయత్నించారని సునీత ఆరోపించారు. సొంత వాళ్లే మోసం చేయడంతో వివేక ఓడిపోయారని, అయినా నిరాశ చెందకుండా మరింత యాక్టివ్ అయ్యారని సునీత రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. ఎంత ప్రయత్నించినా ఆయన్ని అనగదొక్కలేక పోతున్నామని భయం ప్రత్యర్థుల్లో ఎక్కువైందని, అప్పట్లో తమకు ఇదంతా అర్థం కాలేదని ఆమె వెల్లడించారు.

హత్య తర్వాత మార్చి 15, 2019 న మార్చురీ బయట అవినాష్ తన వద్దకు వచ్చారని, రాత్రి 11:30 గంటల వరకు పెదనాన్న తన కోసం ఎన్నికల ప్రచారం చేశారని చెప్పారు. సినిమాల్లో చూపించే విధంగా హంతకులు మన మధ్య ఉంటారని, మనం మాత్రం రియలైజ్ కాలేమని సునీతా రెడ్డి వాపోయారు. వివేకానంద రెడ్డి చంపిన వారిని వదిలిపెడితే ఏమి సందేశం వెళుతుందని, సిబిఐ దర్యాప్తు ఎందుకు త్వరగా పూర్తి కావట్లేదని సునీతా రెడ్డి ఈ సందర్భంగా ప్రశ్నించారు. హత్యా రాజకీయాలు ఉండకూడదని, వంచన, మోసానికి పాల్పడిన మా అన్న పార్టీ వైకాపాకు ఓటు వేయవద్దని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. అవినాష్, భాస్కర రెడ్డిని ఇంకా ఆయన రక్షిస్తూనే ఉన్నారని, ఇదే ప్రభుత్వం మళ్లీ వస్తే ఇంకా కష్టాలు పెరుగుతాయని సునీత రెడ్డి పేర్కొన్నారు. జగన్ పాత్ర పైన విచారణ చేయాలని మరోసారి ఆమె స్పష్టం చేశారు.


వివేకానంద రెడ్డి హత్య కేసు కు సంబంధించి సిబిఐ దర్యాప్తునకు వెళ్దామని జగన్ ను అడిగానని, అందుకు ఆయన



అంగీకరించలేదన్నారు. సిబిఐ కి వెళ్తే అవినాష్ బిజెపిలోకి వెళ్తారని జగన్ తనతో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా మీడియా ముఖంగా సునీత వెల్లడించారు. అందుకే తానే వెళ్లి సిబిఐకి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. సిబిఐ కి వెళ్ళిన తరువాత తనతోపాటు భర్తకు వేధింపులు పెరిగాయని, సిబిఐ పైన కేసులు పెట్టడం మొదలుపెట్టారని ఆరోపించారు. కేసు విచారణ ముందుకు సాగకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించడంతోపాటు కర్నూలు ఆసుపత్రి దగ్గర ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసని ఈ సందర్భంగా సునీత పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల మద్దతు తీర్పు తనకు కావాలన్నారు. వివేకానంద రెడ్డి కేసు విచారణలో ప్రతి ఒక్కరి సహకారం తనకు కావాలని, ఏపీ ప్రజల మద్దతు ప్రజా తీర్పు తనకు అనుకూలంగా అందించాలని ఆమె కోరారు. నేను ఎక్కడికి వెళ్లినా వివేకా హత్య కేసు గురించే అడుగుతున్నారని, ఈ కేసు పోరాటంలో అండగా నిలిచిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎంపీ రఘురామకృష్ణ రాజుకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# ప్రత్తిపాటి కుమారుడి అరెస్ట్ పై గవర్నర్ కు లేఖ రాసిన చంద్రబాబు

టీడీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర గవర్నర్ కు లేఖ రాశారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ అరెస్ట్ విషయాన్ని తన లేఖలో ఆయన వివరించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పైనా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. అణచివేయాలన్న ఉద్దేశంతోనే టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని చంద్రబాబు విమర్శించారు. విపక్షాలను వేధించేందుకు ఏపీఎస్డీఆర్ఐని అస్త్రంగా వాడుకుంటున్నారని, విధేయుడైన వ్యక్తిని స్పెషల్ కమిషనర్ గా నియమించుకుని వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.



# విద్యార్థుల ఫీజులు చెల్లింపుకోసం విద్యాదీవెన కింద రూ.30.31 కోట్లు విడుదల

**- తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిన ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్**

**-జిల్లాలో 43,209 మంది విద్యార్థులకు లబ్ధి : జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి**

విజయనగరం , మార్చి 01 బీ
జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న బి.సి., ఎస్.సి.,ఎస్.టి,ఇ.బి.సి., ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థులకు అక్టోబరు - డిశంబరు త్రైమాసికంకు సంబంధించి ఫీజుల చెల్లింపుకోసం జగనన్న విద్యాదీవెన పథకం కింద ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం నిధులు విడుదల చేశారు. కృష్ణా జిల్లాలోని పామర్రులో జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఫీజుల నిధులు జమ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్న విద్యాదీవెన కింద ఆయా విద్యార్థులు, వారి తల్లులకు ఫీజు మొత్తాలకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు తదితరులు అందజేశారు.జిల్లాలో మొత్తం 43,209 మంది కళాశాల విద్యార్థులు



జగనన్న విద్యాదీవెన కింద లబ్ధిపొందుతున్నారని, వీరికి రూ.30,31,38,187(30.31 కోట్లు) జమ అవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి యీ సందర్భంగా చెప్పారు. పిల్లల చదువుల కోసం వారి తల్లిదండ్రులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వమే పూర్తిగా వారి పూర్తి ఫీజులు చెల్లిస్తోందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న వసతులు, సౌకర్యాలను వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా కృషిచేయాలన్నారు. జిల్లాలో 34,992 మంది బి.సి.,



3,846 మంది ఎస్.సి, 2,535 మంది ఇ.బి.సి, 915 మంది కాపు, 611 ఎస్.టి., 266 ముస్లిం, 44 క్రిస్టియన్ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.జిల్లా బి.సి.సంక్షేమ అధికారి కె.సందీప్, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, మైనారిటీ సంక్షేమ అధికారి రుద్రపాటి శామ్యూల్ జాన్, సహాయ బి.సి.సంక్షేమ అధికారి యశోధన రావు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కర్నూలు రేంజ్ డీఐజీ విజయ రావు .

ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మార్చి 01:
ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ విజయ రావు డీఐజీ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ముందుగా పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలం. ఆక్కడి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేయు బహిరంగ సభ డీఐజీ పరిశీలించి శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యల పై పలు సూచనలను అధికారులకు ఇచ్చారు. అలాగే సీఎం పర్యటన రూట్ మ్యాప్ ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ తో పాటు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి , ఆడిషనల్ ఎస్పీలు ప్రవీణ్ కుమార్. చంద్రబాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లి రూరల్ మరియు టౌన్ సి ఐ లు మరికొందరు పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**-3 న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో**

**జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు**

విజయనగరం మార్చి 01 :
ఈ నెల 3వ తేదీన జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చెప్పారు. తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని ఆయన కోరారు. పోలియో వ్యాధిని రూపుమాపేందుకు పోలియో చుక్కలు వేయించడమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు సుమారు 1,98,478 మంది ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కలను వేయడానికి 1,182 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామని డిఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. సుమారు 5వేల మంది



ఈ కార్యక్రమంలో విధులను నిర్వహించడానికి సిద్ధమయ్యారని, 2,450 బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని 192 మంది సూపర్‌వైజర్లు, 66 మొబైల్ బృందాలు, 20 ట్రాన్సిట్ బృందాలు పర్యవేక్షించనున్నారని తెలిపారు. జిల్లాలో 56 కోల్డ్ చైన్ పాయింట్లను ఏర్పాటు చేశామని, 3,12,000 డోసులను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలో 1999లో చివరిసారిగా రెండు పోలియో కేసులు నమోదయ్యాయని, అప్పటినుంచి నేటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడానికి కారణం, పిల్లలందరికీ పోలియో చుక్కలను వేయించి



ప్రజలు సహకరించడమే కారణమని ఆయన పేర్కొన్నారు. వలస జనాభా, సంచార జాతులు, మురికివాడలు, ఇటుక బట్టీలు, ఇతర మారుమూల ప్రాంతాలపైనా దృష్టిపెట్టి, అక్కడి పిల్లలకు కూడా పోలియో చుక్కలను వేయించడానికి చర్యలను తీసుకున్నామని తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రాణి, జిల్లా టీకాధికారి డాక్టర్ అచ్చుతకుమారి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపికి షాక్.. వైసీపీలోకి సతీష్ రెడ్డి.!

చంద్రబాబు పెద్ద అవకాశవాది: సతీష్ కుమార్ రెడ్డి
చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ ప్రాభవం కోల్పోతోందని, ఆయన పెద్ద అవకాశవాదని సతీష్ కుమార్ రెడ్డి విమర్శించారు. తెలుగుదేశం పార్టీని వ్యాపార సంస్థలా నారా లోకేశ్ నడుపుతున్నారని ఆరోపించారు. ”27 ఏళ్లు టీడీపీకి పని చేశా. పులివెందులలో టీడీపీ బలోపేతానికి పాటుపడ్డాను. నా కష్టానికి ప్రతిఫలం ఇవ్వకుండా అవమానించారు. నాకు జరిగిన అవమానంతో 2020 లోనే టీడీపీని వదిలి బయటకి వచ్చాను. 27 ఏళ్లు వైఎస్ కుటుంబంతో పోరాటం చేశా, ఇబ్బందులు పెట్టా.. అయినా %ఎ% జగన్ పెద్ద మనసుతో నన్ను పార్టీ లోకి ఆహ్వానించారు. నాలుగేళ్లు నన్ను టీడీపీ పట్టించుకోలేదు.. ఇప్పుడు రాయబారం పంపుతున్నారు. చంద్రబాబు పెద్ద అవకాశ వాది.. చంద్రబాబు నాయకత్వం పార్టీలో తగ్గిపోతుంది. వ్యాపార సంస్థలా పార్టీని లోకేశ్ నడుపుతున్నాడు. నాలాంటి చాలా మంది సీనియర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇకపై జగన్ తో నా ప్రయాణం ఉంటుంది. నా అవసరం జగన్ కు ఒక్క శాతం కూడా లేదు. ఆయన ఏ బాధ్యత అప్పగించినా పని చేస్తా. నాకు ఎలాంటి డిమాండ్స్ లేవ”ని సతీష్ కుమార్ రెడ్డి అన్నారు.



# మానవత్వంతో అనాధకు ఆపన్న హస్తం

బొబ్బిలి
మానవత్వం తో ఓ అనాధకు ఆపన్న హస్తం అందించి వైద్యానికి, ఆరోగ్యానికి బరోసాకల్పించారు కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు మాస్టారు. ఆమె పేరు పుల్కో దేవి వయసు 65 ఇయర్స్ వివరాల్లోకి వెళితే....ఒరిస్సా నుండి బతుకు దెరువు కోసం బొబ్బిలి వచ్చి నెమలి పించాలు అమ్ముకుంటు నోబుల్ పాఠశాల ఎదురుగా నిర్మాణములో ఉన్న భవనంలో తలదాచుకుంటున్నది నిన్న రైల్వే స్టేషన్ జంక్షన్లోగుర్తు తెలియని వాహనం తగలడం తో ప్రమాదానికిగురైంది అక్కడే ఉన్న కింతలవాని పేట కు చెందిన కిషోర్ అనే యువకుడు మరికొందరి సహాయంతో బొబ్బిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు .వైద్యులు తక్షణమే స్పందించి ఎడమ కాలుకి 7 కుట్లు గెడ్డం కు రెండు కుట్లు వేశారు. పై దవడ లో 3 పళ్ళు ఊడి పోయాయి. వైద్యులు చికిత్స అందించి పంపించి వేశారు. ఈ విషయాన్ని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు మాస్టారికి తెలియచేసి అనాథను ఆదుకొని ఆరోగ్యం మెరుగు పడేందుకు ,పోషణకు సహకారం అందించవలసినదిగా కిషోర్ అనే యువకుడు కోరడంతో వెంటనేమానవత్వం తో స్పందించిన జె సి రాజు గురువారం ఆమెను పరామర్శించి పోషణకు, వైద్య ఖర్చులకు కొంత మొత్తాన్ని ఆమెకు అందించటం తో పాటు మెరుగైన వైద్యం కొరకు స్థానిక %చీ=×% హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి వైద్య సహాయం అందిస్తామని ఆమెకు భరోసా కల్పించు ఆపన్న హస్తాన్ని అందించారు..

# మేముసిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- ఎమ్మెల్యే శంబంగి**

బొబ్బిలి
ప్రతి కుటుంబాన్ని బూత్ కమిటీ సంప్రదించి వైసిపి ప్రభుత్వంలో ఆ కుటుంబానికి అందిన లబ్ధిని వివరించాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సూచించారు.శుక్రవారం ఉదయం బొబ్బిలి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో గల బూత్ కన్వీనర్ల సమావేశం అయినా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎక్కడ లోటుపాట్లు ఉండరాదనే లక్ష్యంతో బూత్ కమిటీలను పక్కాగా నియమించామని ప్రతి ఇంటి తోను పార్టీ క్యాడర్ మమేకం అవ్వవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి బూత్ స్థాయిలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు సచివాలయ కన్వీనర్లు గృహసారథులు కలిసి మేము సిద్ధం మా బూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని



విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు అంతా ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించి మరో నెల 15రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు,వైస్ చైర్మన్లు చలికాని మురళీకృష్ణ,గొలగాన రమాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు వైసీపీ సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్,పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శంబంగి..


బొబ్బిలి
బొబ్బిలి మండలంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు మంజూరైన సీఎం సహాయనిది చెక్కులను బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అందజేశారు. బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన మావిరెడ్డి సూర్యచంద్రరావుకు రెండు లక్షల 50 వేల రూపాయలు, కొండదేవుపల్లి గ్రామానికి చెందిన బోరపురెడ్డి ప్రమీల కు రెండు లక్షల రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైనట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు,మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షులు ఉత్తరావల్లి అప్పలనాయుడు,వైసీపీ నాయకులు హాజరయ్యారు.



# ఫారెస్ట్ మహిళా ఉద్యోగులపై వేధింపులు..

**- న్యాయం చేయాలంటున్న బాధితురాలు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి01:
నంద్యాల జిల్లా ఫారెస్ట్ రేంజర్ దినేష్ రెడ్డి పై మహిళా ఉద్యోగిని రేష్మ ఫైర్ అయ్యారు. నూనెపల్లెలోని ఫారెస్ట్ అసోసియేషన్లో ఏర్పటు చేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లడుతూ..డివిజన్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలైన తాను ఫారెస్ట్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతుంటే తనపై కక్ష కట్టి వేధింస్తున్నాడంటు అమె ఆరోపించారు. సెక్షన్ అఫీసర్‌గా తాను విధులు నిర్వహిస్తూంటే కుట్రతో తనను తొలగించడానికి రేంజర్ ప్రయత్నిస్తున్నారని ఉద్యోగి రేష్మి అవేదన వ్యక్తం చేశారు. తనకు జరుగుతున్న అన్యాయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా న్యాయం జరగలేదని, తనను వేరే సెక్షన్ మార్చి న్యాయం చెయ్యాలని అమె డిమాండ్ చేస్తున్నారు.




# జయహో బిసి

విజయనగరం
తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజు , నియోజకవర్గ ఇంచార్జ్, తెలుగుదేశం పార్టీ జనసేన విజయనగరం శాసనసభ ఉమ్మడి అభర్ది పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు సూచన మేరకు విజయనగరం పట్టణంలో ప్రాంతాల వారీగా “జయహో బిసి” కార్యక్రమం నిర్వహించుటలో భాగంగా ఈరోజు 22వ, 23వ, 24వ, 25వ మరియు 26వ డివిజన్ లకు సంబంధించి గవర వీధి జంక్షన్ లో “జయహో బిసి” సమావేశం బీసీ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక వార్డులకు చెందిన బీసీ కులవృత్తులవారు మరియు బీసీ వర్గాల ప్రజలు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వైకాపా ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై దాడులు వంటి విషయాలపై చర్చించి తెలుగుదేశం పార్టీ - జనసేన పార్టీలకు మద్దతుగా బిసిలందరూ నిలిచి సైకిల్ గుర్తుపై ఓటు వేసి విజయనగరం శాసనసభ అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు గారిని గెలిపించాలని నాయకులందరూ కోరారు.





# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి01:
నంద్యాల జిల్లా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, నేషనల్ జూనియర్ కాలేజీ, న్యూ క్లియస్ జూనియర్ కాలేజిలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను తనిఖీ చేస్తూ తగు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ డా.కె శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి.



# నంద్యాల జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన దొర్నిపాడు ఎస్సై బి.సురేష్

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 01:
సాధారణ బదిలీలో భాగంగా కర్నూలు జిల్లాలో అధోని 1 టౌన్ పోలీసు స్టేషన్ నందు విధులు నిర్వహిస్తు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సబ్-డివిజన్ పరిదిలోని దొర్నిపాడు సబ్-ఇన్స్పెక్టర్ గా బదిలీ అయిన బి. సురేష్ పదవి బాద్యతలు స్వీకరించిన అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ని జిల్లా పోలీస్ కార్యాలయం నందు పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.




# మద్యంపై యుద్ధానికి మేము సిద్ధం!

### - నిషేధానికి నువ్వు సిద్ధమా తేల్చుకో జగన్మోహన్ రెడ్డి !

### మద్యపాన నిషేధం అమలు చేయకపోతే మహిళల ఓట్లువేయరు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 01:
రాష్ట్రంలో అధికారం కోసం ఓట్లు వేయించుకోవటానికి నువ్వు సిద్ధం అంటే గతంలో మహిళా లోకానికి ఇచ్చిన హామీని మద్యం నిషేధించకపోవడం పై నీపై యుద్ధానికి మేము సిద్ధం అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యాన్ని నిషేదిస్తానన్న వాగ్దానానికి వైసీపీ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరుతూ.. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లాసమితి ఆధ్వర్యంలో మద్యాన్ని నిషేధించాలని కోరుతూ స్థానిక సిపిఐ కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి సాయిబాబా నగర్ వద్ద ఉన్న మద్యం షాపు ధర్నా నిర్వహించగా మద్యం షాపు యాజమాన్యం హుటాహుటిన మద్యం షాపును మూసేసి బయటికి వెళ్లడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు రజిత. షమీం బేగం. లక్ష్మీదేవి. హసీనా నారాయణమ్మ. లక్ష్మీదేవి. ప్రమీల. స్వాతి.మృతుజాభి. సుశీలమ్మ. పాల్గొన్నారు అనంతరం పై నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు మహిళా లోకాన్ని ఉద్దేశించి రాష్ట్రంలో మద్యపాదన నిషేధిస్తామని చెప్పి హామీ ఇచ్చి అది నెరవేరుకపోగా అధికార పార్టీ నాయకులతో కల్తీ మద్యాన్ని తయారు చేపించి అమ్మకాలు చేయడం వల్ల మద్యం తాగిన వారు మరణించడంతో తాళి తెగిన మహిళలు వారి ఉసురు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తగులుతుందని ఇప్పటికైనా ఇచ్చిన హామీలో భాగంగా మద్యపానాన్ని నిషేధించాలని లేనిపక్షంలో రాబోయే ఎన్నికలలో మహిళలే నీకు తగిన బుద్ధి చెప్తారని పై నాయకురాళ్లు హెచ్చరించారు




# సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్‌లను అందజేసిన ఎమ్మెల్యే శిల్పారవి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి01:
ముఖ్యమంత్రి సహాయనిధి నుండి సంద్యాల పట్టణానికి చెందిన 7మంది లబ్ధిదారులకు 7 లక్షల 25వేల 500 రూపాయల చెక్లను ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పంపిణీ చేశారు. లబ్ధిదారుల తరుపున సీఎం జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యేకు నంద్యాల పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా అడ్వకేట్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న వారికి ఆరోగ్యశ్రీ పథకం క్రింద వర్తించని రోగాలకు చికిత్స అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయాన్ని 7మందికి 7లక్షల25వేల500 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్ ను అందజేయడం జరిగిందన్నారు. అందుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు, సీఎం జగన్ మోహన్ రెడ్డికి లబ్ధిదారుల తరుపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, అడ్వకేట్ ప్రతాపరెడ్డి, కిరణ్ కుమార్,తిమోతి, తదితరులు పాల్గొన్నారు.



# నూతన వడ్డీ రహిత ఆసర కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభోత్సవం.

### -వడ్డీ రహిత సమాజం నిర్మించడం కోసం ఆసరా సొసైటీ ప్రారంభ - చైర్మెన్ జబివుల్లా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 01:
నంద్యాల పట్టణంలో నూతన వడ్డీ రహిత ఆసర కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న యస్.డి.పి.ఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు హఫీస్ అతావుల్లా ఖాన్ , యస్.డి.పి.ఐ పార్టీ నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ ఫాజిల్ దేశాయ్, ఆసర సొసైటీ చైర్మెన్ జబివుల్ల పాల్గొన్నారుయస్.డి.పి.ఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు హఫీస్ అతావుల్లా ఖాన్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గల పేద, మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారులు మరియు రోజువారి కూలి పని చేసే ప్రజలను వడ్డీ నుండి కాపాడి వారి ప్రగతికి తోడ్పడడమే ఈ ఆసరా సొసైటీ యొక్క ధ్యేయము ఈ సమాజంలో గల వడ్డీని, పేదరికాన్ని దూరం చేసి వడ్డీ ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థ నుండి ప్రజలను కాపాడుకొని వడ్డీ రహిత సమాజాన్ని నిర్మించడమే ఆసర సొసైటీ యొక్క లక్ష్యం అని తెలియజేశారు. యస్.డి.పి.ఐ పార్టీ నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ ఫాజిల్ దేశాయ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో చాలామంది వడ్డీల బారిన పడి అధిక వడ్డీ కట్టలేక ఆత్మహత్య చేసుకున్న వారు ఉన్నారని అధిక వడ్డీల ద్వారా ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని డబ్బున్న కొంతమంది చిన్నపాటి అవసరాలకు మరియు అత్యవసర అవసరాలకు వారి దగ్గర వచ్చిన వారికి వారి బలహీనతపై అధిక వడ్డీ వసూలు చేస్తూ వారిని పిడుస్తున్నారని సంపాదించిన సంపాదన మొత్తం వడ్డీలకు కట్టడానికి సరిపోతుందని అధిక వడ్డీ వసూలు చేసే వారిపై పోలీసు అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని తెలిపారు వడ్డీలలో కుమిలిపోతున్న ప్రజలను వడ్డీ నుండి విముక్తి కలిగించడం కోసం ఆసర సొసైటీ ఎంతో ఉపయోగపడుతుందని కావున నంద్యాల పట్టణ ప్రజలు ఆసర సొసైటీ యొక్క సేవలు ఉపయోగించుకొని వడ్డీ నుండి ప్రజలు కూడా విముక్తి పొంది వడ్డీ రహిత సమాజా నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆసర సొసైటీ బోర్డు మెంబర్స్, పార్టీ నంద్యాల జిల్లా మరియు అసెంబ్లీ నాయకులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు





# బనగానపల్లె సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి.

### -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 01:
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 4వ తేదీ బనగానపల్లె పట్టణానికి రానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో సియం పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మజ, అన్ని శాఖల జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బనగానపల్లె పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు పనులు చేపట్టి సీఎం పర్యటనను సాఫీగా విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులకు అప్పగించిన పనులు బాధ్యతాయుతంగా చేపట్టి ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు.

హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే ప్రదేశంలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి దుమ్ము లేయకుండా వాటరింగ్ పెద్దఎత్తున చేయాలని ఆర్ అండ్ బి, అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీఎస్పిడిసిఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, మీటింగ్ సమీపాల్లో ఏర్పాటు చేసిన సేఫ్ రూముల్లో అత్యవసర మందులతో పాటు నిపుణులైన డాక్టర్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. గ్రీన్ రూమ్, సభా వేదిక, విజిటర్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలలో కల్తీ లేకుండా జాగ్రత్తగా చెక్ చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సభా వేదిక ప్రాంతంలో ప్రాపర్ గా త్రాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఆర్టీవో శివారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర రెడ్డి, మిరియాల దాసు సంబంధిత జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఎన్నికల నిర్వహణపై పటిష్ట ఏర్పాట్లు చేసుకోండి.

### -నోడల్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 01:
సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణను నిర్ణీత షెడ్యూల్ లోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు గైర్హాజరు కాకుండా రిజర్వు సిబ్బందిని కూడ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల బృంద అధికారులకు శిక్షణ నివ్వడంతో పాటు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని సంబంధిత నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా నివేదికలు తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాల పర్యవేక్షణపై ఏర్పాటు చేసుకున్న ఎంసిసి బృందాలకు ప్రాపర్ శిక్షణ నివ్వాలన్నారు



# నంద్యాల నియోజకవర్గ స్థాయి టిడిపి జనరల్ బాడీ మీటింగ్ మరియు శంఖారావం కిట్ల పంపిణీ.







ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 01:
నంద్యాల తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి మరియు నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో ఎన్నికల శంఖాన్ని పూరిస్తూ అందరిలో చైతన్యాన్ని నింపడానికి నిర్వహించిన నియోజకవర్గస్థాయి టిడిపి జనరల్ బాడీ మీటింగ్ మరియు శంఖారావం కిట్ల పంపిణీ నంద్యాల టిడిపి ఆఫీసు నందు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ఎన్నికలలో ఎలా ముందుకు వెళ్లాలి ఎలా ఓటర్లకు చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఎలా తెలియజేయలో తెలిపారు. అలాగే క్లస్టర్ , యూనిట్ ఇన్చార్జిలు , మరియు బూత్ కన్వీనర్ లు ప్రతి ఇంటికి వెళ్లి శంఖారావం కిట్లను ప్రతి ఇంటికి అందజేయాలని వారికి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టబోయే పథకాల గురించి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి క్లస్టర్ లు , యూనిటీ ఇన్చార్జిలు , బూత్ కన్వీనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఏఐఎస్ఎఫ్ పోరాట ఫలితంగా విద్యార్థులను వేధించిన హెచ్ఎం జానకి సస్పెండ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 01:

విద్యార్థుల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ ఏఐఎస్ఎఫ్ జెండా ఉంటుంది.సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తుంది. విద్యార్థులను, తోటి ఉపాధ్యాయులను మానసికంగా వేధించిన హెచ్ఎం జానకి ని సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ కి, డీఈఓ మరియు ఆర్జెడి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కి ధన్యవాదాలు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం లోని కొండ పేటలో ఉన్న బాయ్స్ హైస్కూల్లో హెచ్ఎం జానకి నిత్యం అమ్మాయిలను,అబ్బాయిలను వేధిస్తూ,అన్ పార్లమెంట్ భాషలో తిడుతూ, విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తూ, ప్రార్థన సమయంలో విద్యార్థులను ఎలా పడితే అలా తిడుతూ, తరగతి గదులను ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లి డిస్టర్బ్ చేస్తూ నిత్యం విద్యార్థులను వేధిస్తు,ఇక్కడ నేను ఏది చెప్తే అది వినాలి అంటూ వినకపోతే ఎవరినైనా ఏమైనా చేస్తాను నన్నెవరూ ఏమి చేసుకోలేరని విర్రవీకిన హెచ్ఎం జానకి పై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేయడం జరిగిందని వారు తెలిపారు. అంతేకాకుండా డీఈఓ,ఆర్జెడి,పాఠశాల విద్యాశాఖ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని వారన్నారు. బనగానపల్లె బాయ్స్ హై స్కూల్ హెచ్ఎం జానకి గారిపై ఏఐఎస్ఎఫ్ నాయకత్వం చేసిన ఫిర్యాదులను స్వీకరించిన విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ చేపట్టి సస్పెండ్ చేయడం జరిగిందనివారు తెలిపారు.ఈ విధంగా చేయడం వల్ల నిత్యం విద్యార్థులను వేధిస్తున్నటువంటి హెచ్ఎం జానకి నుండి విద్యార్థుల భవిష్యత్తును కాపాడినట్టేనని వారు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం పరితపిస్తూ నిత్యం విద్యార్థులకు




అందుబాటులో ఉంటూ విద్యార్థులకు మంచి చదువు అందించేటువంటి ఉపాధ్యాయులను కూడా అనేక రకాలుగా ఇబ్బంది పెట్టినటువంటి హెచ్ఎం జానకి ని సస్పెండ్ చేసినందుకు డిఇఓ,ఆర్జెడి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాల అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ ఉదయ్, మహానంది లు పాల్గొన్నారు.

# పట్టణంలోని 300 కుటుంబాలు టీడీపీ మరియు జనసేనను వీడి వైఎస్సార్సీపీలోకి చేరిక.

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి01: నంద్యాల పట్టణంలోని దేవనగర్, మూల్లాన్ పేట, నూనెపల్లె, ఉప్పరిపేట, ఫారుక్ నగర్ ప్రాంతాలకు చెందిన టీడీపీ మరియు జనసేన పార్టీలను వీడి వైఎస్సార్సీపీలోకి 300 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్సీపీ నాయకులు ప్రదీప్ రెడ్డి, దేవనగర్ బాష, సుధీర్, అడ్వకేట్ ప్రతాప్ రెడ్డి అర్జున్, కారురవికుమార్, రవికిరణ్, మణికంఠల ఆద్వర్యంలో ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి సమక్ష్యంలో చేరారు. వీరందరిని ఎమ్మెల్యే పార్టీకండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ భలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని వారికి ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, పథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులైన వీరంతా వైఎస్సార్సీపీ కుటుంబంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు.





నవరత్నాలను అర్హులైన అందరికి అమలు చేయడం జరిగిందన్నారు. నంద్యాల జిల్లా అయిన తర్వాత పట్టణ అభివృద్ధిలో భాగంగా మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, ఉర్దూ కళాశాల, వసతి గృహాలు, ఇలా అనేకంగా అభివృద్ధికి బాటలు వేశామన్నారు. బ్రతుకితే జగనన్నలాగా ధైర్యంగా బ్రతకాలని, శత్రువులందరు ఏకమైనా ఒక్కడే ఒంటరిగా ఎన్నికల పోరాటంలో నిలిచి, దేవున్ని ప్రజలకు నమ్ముకొని జగనన్న యుద్ధం చేస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరు పార్టీ భలోపేతానికి కృషిచేయాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి సంపూర్ణ మద్దతును అందించాలని, ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవనగర్, ముల్లాన్ పేట, నూనెపల్లె, ఉప్పరిపేట, ఫారుక్ నగర్ ల నుండి అఖిల్, ఉదయ్, వరుణ్, చరణ్, సూరి, మద్దిలేటి, మోహిత్, అరుణ్బాష, సైఫుద్దీన్, పూరి, హుసేన్, ప్రతాప్, సాయి, రవి, జబిఉల్లా, అబ్దుల్లా, రవి, షబ్బీర్, హర్ష, వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పాల్గొన్నారు.



## అక్రమ తవ్వకాలకు అడ్డా.. ఎర్రమల కొండలు.

ఆంధ్ర ప్రగతి తమ రాజు పల్లె మార్చి01: అక్రమ త్రవ్వకాలకు అడ్డాగా మారిన ఎర్రమల కొండలు సర్వే నెంబర్ 308 లో దాదాపు వేలాది క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి( గ్రావెల్ ) అన్యాక్రాంతం అయినా పట్టించుకోని అధికారగనం విఅర్ఏ,విఅర్ఓ,లను లెక్క చేయని మట్టి మాఫియా. నంద్యాల చుట్టు ప్రక్కల భూములు రియల్ ఎస్టేట్ కు అనువుగా ఉన్నందున కోట్లకు పడిగెత్తిన మట్టి మాఫియా గాళ్ళు సొమ్ము ఒకడిది సోకు మరొకడిది అన్న చందంగా పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు మత్తులో జోగుతున్నారు,తూ తూ మంత్రం గా, పేపర్ కు వచ్చినపుడు మాత్రమే శ్రద్దగా రాత్రింపగల్లు ఉద్యోగం చేస్తారు.అనధికారికంగా దోపిడీకి గురువుతున్న ఎర్ర కొండలు.ఈ కొండల్లో కంకర కొరకు వందల మీటర్లు బ్లాస్టింగ్ చేయటం వలన భూమిలోని పొరలు కంపనాలకు గురిఅయి నీటి విలువలు తగ్గి బోర్ లు ఎండిపోయి తాగు నీరు లేక గ్రామ ప్రజలు విలవిల లాడుతున్నారు. భారీ బ్లాస్టింగ్ మరియు కంట్రోల్ బ్లాస్టింగుకు కూడా అనుమతులు లేవని గ్రామ ప్రజలు తెలుపటం జరిగింది.ఈ ప్రాంతం లో వేలాది వన్యాప్రాణులు కుందేళు ,,అడవి పందులు, జాతీయ పక్షి నెమల్లు ఆనవాళ్ల లేకుండా పోతున్నాయి. దీనికి కారణం భారీ పేలుళ్ళు.... చూసి చూడనట్లు వ్యవహారిస్తున్న అధికారులు.



# ప్రభుత్వ ఏజెంట్ల వ్యవహరిస్తున్న జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డి.

ప్రగతి బనగానపల్లె మార్చి01:

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బనగానపల్లె పర్యటన సందర్భంగా నంద్యాలలో విద్యాలయాలను ఆదివారము తెరిపించి సోమవారం సెలవు ప్రకటించలని జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో సెలవు దినాలైనా ఆదివారం రోజు ఏ స్కూల్లో ఏ ఆఫీసులో తెరవడం లేదు కానీ నంద్యాల డీఈవో సుధాకర్ రెడ్డి ఒక కొత్త వరువడిని తెచ్చేందుకు పాఠశాలలో ఉన్న బస్సుల కోసం ఆదివారాలు పాఠశాలలు తెరిపించి సోమవారము సెలవు ప్రకటించమని ప్రకటన జారీ చేయడం ఆ బస్సులలో బనగానిపల్లిలో జరుగుతున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు జనాలను తరలించేందుకు ఇలాంటి దౌర్భాగ్యపు పనులు చేసేందుకు విద్యాధికారి సుధాకర్ రెడ్డి తన ఉద్యోగం మానుకొని వైసిపి కండువా కప్పుకొని తిరగాలని తెలిపారు. డీఈఓ సుధాకర్రెడ్డి కి జారీ చేసిన జీవోను ఉపసంహరించుకొని యధావిధిగా పాఠశాలను ఆదివారము సెలవు దినాన్ని యధావిధిగా కొనసాగించాలని లేదు పక్షంలో సిపిఐ ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు సంసిద్ధంగా ఉన్నామని పై నాయకులు హెచ్చరించారు.



# ఆదివారం పనిదినంగా పెట్టి సోమవారం సెలవు ఇవ్వడం సమంజసం కాదు.

**జగన్ మోహన్ రెడ్డీపై ప్రేమ ఉంటే సోమవారం కూడా సెలవు ప్రకటించుకోండి**

**అయ్యా డీఈవో గారు మీకు సీఎం ప్రోగ్రాం ముఖ్యమా? విద్యార్థుల చదువులు ముఖ్యమా.?**

ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా మార్చి 01:

నంద్యాల జిల్లాలో సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం ఉంటే నీ ఇష్టం వచ్చినట్టు సెలవు రోజులను పని దినాలుగా పని దినాలను సెలవురోజులుగా మారుస్తారా? విద్యార్థుల చదువులకు ఏమైనా పర్వాలేదా?సీఎం నంద్యాల జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం పని దినంగా ప్రకటించిన డీఈవో సుధాకర్ రెడ్డి ఆదేశాన్ని వ్యతిరేకించిన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం లో సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యటన ఉంటే నంద్యాల జిల్లా డిఇఓ సుధాకర్ రెడ్డి ఆదివారం పని దినంగా ప్రకటించి సోమవారం సెలవు ఇవ్వడాన్ని ఏఐఎస్ఎఫ్ గా వ్యతిరేకిస్తున్నామని వారు తెలిపారు.నంద్యాల జిల్లాలో సీఎం పర్యటన అంటే విద్యార్థులకు ఏం సంబంధం అని వారు ప్రశ్నించారు.ఆదివారం సెలవు దినంగానే ప్రకటించాలని, సోమవారం మీకు అవసరం అయితే సెలవు ప్రకటించుకోవాలని వారు తెలిపారు. జిల్లాలో సీఎం పర్యటన ఉంటే ప్రతిసారి విద్యాసంస్థలను ఇబ్బంది పెట్టడం విద్యాసంస్థల బస్సులను తీసుకెళ్లడం సెలవులు ప్రకటించడం సరైన పద్ధతి కాదని వారన్నారు. కావున తక్షణమే జిల్లా డీఈవో ప్రకటించిన ఆదివారం పని దినాన్ని రద్దుచేసి ఆదివారం సెలవు దినాన్ని ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో శనివారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ ఉదయ్, ఎర్రిస్వామి, మహానంది లు పాల్గొన్నారు.






# గిరిజనులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి.

ఆంధ్ర ప్రగతి విజయవాడ మార్చి 01:

రాష్ట్రంలోని ఉన్న గిరిజనుల అభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఎటువంటి బ్యాంక్ లింకుతో సంబంధం లేకుండా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ కోరారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ వారి కార్యాలయంలో డైరెక్టర్ వెంకట మురళిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ గిరిజనులు ఇప్పటికీ వెనుకబాటుకు గురవుతున్నారని, సంక్షేమ అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు, ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు పథకం మంజూరు చేసి ఎటువంటి బ్యాంకు లింకుతో సంబంధం లేకుండా ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు అయ్యేలా చూడాలని అన్నారు. ఇప్పటికే ఎన్నో పథకాలు అధికార యంత్రాంగం గిరిజనులకు అందనివ్వకుండా నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. వ్యవసాయం, పండ్ల తోటలు పంటలకు సంబంధించిన ల్యాండ్ పర్చేస్ స్కీం, ఎన్ ఎస్ ఎఫ్ డి సి, కరెంటు సప్లై పథకం, ఎనర్జీ ఐ ఎస్ ఎన్, గ్రౌండ్ వాటర్ బోర్ డ్రిల్లింగ్ పథకం, సి ప్ కిరాణం అంగడి లేడీస్ కార్నర్ గొర్రెల పెంపకం బర్రెల పెంపకం ఇలాంటి ఎన్నో పథకాలు ఉన్నప్పటికీ ఇంతవరకు ఏ గిరిజన ప్రజలకు అందడం లేదని గుర్తు చేశారు. ఈ పథకాలన్నిటిని అమలుపర్చి గిరిజన అభివృద్ధికి కృషి చేయాలని డైరెక్టర్ వెంకట మురళిని కోరారు.

# 6 న జరుగు చంద్రబాబు నాయుడు సభకు స్థల సమీకరణ.

**-మాజీ సీఎం చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి01:

నంద్యాల పట్టణంలో ఈనెల 6 వ తేదీన రాష్ట్ర పర్యటనలో భాగంగా నారా చంద్రబాబునాయుడు 6వ తేదీ నంద్యాలకు విచ్చేస్తున్నారని నంద్యాల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ , టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేసే దిశగా నంద్యాలలో రాణి మహరాణి థియేటర్ వెనక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు వారు తెలియజేశారు . అంతేకాకుండా నంద్యాల ఎమ్మెల్యే టికెట్ ఎన్ఎండి ఫరూక్ కి కేటాయించిన తర్వాత మొదటిసారిగా నంద్యాలకు వస్తున్న తరుణంలో ఈ సభను విజయవంతం చేయాలని ఎన్ఎండి ఫరూక్ తెలుగుదేశం నాయకులను , కార్యకర్తలను , అభిమానులను , ప్రజలను కోరారు.

# మెగా జాబ్ మేళా... నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోండి.

**-ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 01:

పీఎస్సీ అండ్ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మార్చినెల 2వ తేది శనివారం ఉదయం 9గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.శశికళ పేర్కొన్నారు. ఈ మేరకు జాబ్ మేళాకు సంబంధించిన బ్రోచర్ ను ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. నిరుద్యోగ విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆద్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 20కి పైగా మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా కంపెనీలకు సంబంధించిన ఉద్యోగాలకు అవసరమైన విద్యార్హతలను కలిగిన విద్యార్థులు వారి రెజ్యూమ్ లను సిద్ధం చేసుకోవాలని, ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకొని జాబ్ మేళాలో పాల్గొనవచ్చున్నారు. ఆయా కంపెనీలలో దాదాపుగా 500కు పైగా ఉద్యోగాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఒక్కొక్క కంపెనీకి సంబందించి విద్యార్థులు రెజ్యూమ్ లను వేర్వేరుగా సమర్పించవలసి ఉందన్నారు. ఈ జాబ్ మేళాలో నంద్యాల జిల్లా పరిదిలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొననున్నారని అన్నారు. వివరాలకు కళాశాల కార్యాలయంలో జాబ్ మేళా సంబంధించిన ప్రతినిధులు గురువయ్య, మహబూబాబాష, 97033 77803, 77993 37695, 8297 812530 సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ పార్వతి, ప్రతాప్రెడ్డి, డీఎస్ఓటీ ఏపీఎస్ఎస్ఓసి మెంటర్లు పాల్గొన్నారు.

